క్లుప్తంగా

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9 నుంచి 11 వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. అధికారుల ఆదేశాల మేరకు 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లకు చివరి తేదీ 11న సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. 12న నామినేషన్ల పరిశీలన, 13న తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీలు, 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామని తెలిపారు. 23న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు.

మున్సిపాలిటీ పరిపాలనపై అవగాహన



కమిషనర్ బాలకృష్ణను కలిసిన గ్రూప్-1 అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన వారికి శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా మూడు రోజులుగా ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయానికి కేటాయించిన గ్రూప్-1 అధికారులు పల్వాయి రాకేష్, పడమటి వెంకట్‌రెడ్డిలకు కమిషనర్ బాలకృష్ణ అవగాహన కల్పిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, ఇంజనీరింగ్ విభాగం, టౌన్‌ప్లానింగ్ విభాగం చేస్తున్న పనులను నిత్యం వివరిస్తున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల ఖర్చు, జనరల్ ఫండ్స్ తెలియజేశారు. వార్డుల వారీగా అధికారులు విధులపై చర్చిస్తున్నారు. ఎన్నికలు నిర్వహణ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పోస్టింగ్స్ ఇచ్చేంత వరకు ఇక్కడే సమగ్రంగా విషయ పరిజ్ఞానం కల్పించేందుకు కృషి చేస్తానని కమిషనర్ బాలకృష్ణ మంగళవారం తెలిపారు.

మహాసభలకు తరలిరండి

14, 15 తేదీల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి సభ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, నాయకులు

హయత్‌నగర్: తుర్కయంజాల్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కమిషనర్ అమరేందర్ రెడ్డి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై, వారి పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై రెండు రోజులు ప్రతినిధులు చర్చిస్తారని చెప్పారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు శ్రీనివాస్, బాలరాజు, సీఐటీయూ నాయకులు దాసు, నవీన్, రవిచందర్, అర్జున్, మధు, అమర్, నగేష్ వెంకమ్మ, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ ఇస్తాం

బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలో జెడ్పీటీసీతో పాటు 8 ఎంపీటీసీ స్థానాలతో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఆ పార్టీ సీనియర్ నాయకులు ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతలను సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. దీంతో పాటు ఏఏ స్థానాలకు ఎవరెవరు పోటీల్లో ఉంటారని తెలుసుకుని వారి పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలని చర్చించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాపయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్, నాయకులు విష్ణుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, జంగమయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, బలదేవరెడ్డి, వీరస్వామిగౌడ్, నవీన్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్, రమేశ్, సురేశ్‌గౌడ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తగ్గని ముసురు.. పంటలకు ఎసరు

- క్షేత్రస్థాయిలో కనపడని వ్యవసాయాధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

నందిగామ: గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురవడం.. ఒకటి, రెండు రోజుల్లో కాస్త వర్షాలు తగ్గాయి అనుకునేలోపే మళ్లీ ప్రారంభం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సోమ, మంగళవారాలలో ఉదయం ఎండ, రాత్రి సమయంలో భారీ వాన కురవడంతో పంట చేనుల్లో చేరిన వర్షం నీరు బయటకు రాలేక పంటలు నీట మునిగిపోయాయి. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన తమకు పంటలు చేతికందుతాయో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇంతా జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చి వారికి ధైర్యం చెప్పాల్సిన సంబంధిత వ్యవసాయాధికారులు జాడ లేకుండా పోయారు.

పంటలపై రైతన్న దిగాలు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, పూలు, వరి తదితర పంటలు అధికంగా వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే పెద్దఎత్తున పంటలు నీట మునిగిపోగా, మిగతా పంటలలో నీరు చేరి పంటలు దెబ్బదితింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సప్పగూడ, వీర్లపల్లి తదితర గ్రామాల్లో అక్కమ్మ చెరువు బ్యాక్ వాటర్‌తో ఇప్పటికే వరి పంటలు నీట మునిగాయి. ఇంకా ఒక్కటి, రెండు రోజులు అలాగే నీటిలో ఉన్నట్లయితే పంట మురిగిపోతుందని ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా చేగూరు, బండోనిగూడ, శ్రీనివాసులుగూడ, మామిడిపల్లి, మొత్కులగూడ, ఈదులపల్లి, నర్సప్పగూడ తదితర గ్రామాల్లో కూరగాయలు, పత్తి, పూల పంటలు నిరంతరం కురుస్తున్న వర్షాలకు నీరు ఎక్కువై వాడిపోతున్నాయని వాపోతున్నారు.



నర్సప్పగూడ శివారులో వంగ తోటలో నిలిచిన వర్షం నీరు, పేరుకుపోయిన కలుపు



చేగూరు శివారులో దెబ్బతిన్న పత్తి పంట

పెరిగిపోతున్న కలుపు..

గత కొన్ని రోజులుగా నిరంతం కురుస్తున్న వర్షాలతో ఒక వైపు పంటలకు నీరు ఎక్కువై చనిపోయే ప్రమాదం ఉండగా, మరో వైపు పంట చెనులలో కలుపు పెరిగిపోతోంది. కలుపు తీసే సమయంలోనే వర్షాలు కురుస్తుడటంతో పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. ఒక వైపు వర్షాలు తగ్గక పోవడం, మరో వైపు గడ్డి పెరిగిపోతుండటంతో కలుపుతీసేందుకు కూలీల ఖర్చుసైతం పెరిగిపోతుందని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

వ్యవసాయాధికారులు ఎక్కడ..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దఎత్తున పంటలు దెబ్బతినడం.. పంట చేలు నీట మునగడం, పంట పొలాల్లో నీరు నిలవడం తదితర కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయాధికారులు ఎక్కడ కూడా కనబడిన దాఖలాలు లేవని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచలను, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగ రీత్యా పదవీ విరమణ సహజమేనని, ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గొప్పదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన ఎస్.వెంకటయ్య పదవీ విరమణ అభినందన సభను పీజీఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వెంకటయ్య చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. రాష్ట్రంలో పదోన్నతులు త్వరలో జరగబోతున్నాయన్నారు. ఈహెచ్‌ఎస్ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరా పార్కు వద్ద ఓపీఎస్ సాధనకు తలపెట్టనున్న పీఆర్టీయూ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్నమంగళారం మాజీ సర్పంచ్ బాలమణిరాములు, నాయకులు పూల గుళ్ల గోపాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్‌గౌడ్, మండల విద్యాధికారి మల్లయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మేడిగడ్డతండా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుసుమమాధురి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డతండా, శంకరకొండ తండాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ కుసుమ మాధురి పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయాలని పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ వినోద, ఆయా గ్రామాల కార్యదర్శులు జగన్‌నాయక్, విజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయండి



డీజీపీ శివధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి కోరారు. డీజీపీగా నియమితులైన తులేకలాన్ గ్రామానికి చెందిన బత్తుల శివధర్‌రెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. రాంరెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలు తాగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించి తప్పకుండా చర్చించి చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

సీజేఐపై దాడికి యత్నం హేయం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నర్సింలు

చేవెళ్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడికి యత్నించడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ముకురం నర్సింలు అన్నారు. మంగళవారం చేవెళ్ల కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. సనాతన ధర్మం ముసుగులో రాజ్యాంగాన్ని అవమానించేలా దేశ అత్యున్నత పదవిలో ఉన్న సీజేఐపై దాడికి యత్నించడం దారుణమన్నారు. దాడికి యత్నించిన రాకేశ్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ట్రెజరర్ రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశ్, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రకాశం, ఈశ్వరయ్య, రవీందర్, శివరాజ్, ప్రదీప్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కుమార్, న్యాయవాదులు వెంకటేశం, యాదిరెడ్డి, చంద్రశేఖర్, సురేష్, నాగిరెడ్డి, జైపాల్, తాజుద్దీన్, గౌతంరెడ్డి, రోజారెడ్డి, విఠలయ్య, రాజశేఖర్, గోపాల్‌గౌడ్, సుదర్శన్, ఆనంద్, మహేశ్, సతీశ్, లోకేశ్వరి, స్వప్న, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు చార్జీలు తగ్గించాలని డిమాండ్

మంచాల: పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలు వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జాపాల గ్రామంలో ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాలంలో ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు చేయలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పేదోడికి పూటగడవని దుస్థితి నెలకొందన్నారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడం దారుణమన్నారు. వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సంజీవ, సతీష్, చంద్రకాంత్, యాదయ్య, నర్సింహ, సోమేశ్, వెంకటేష్, సుదర్శన్, గణేష్, రాజు, పెంటప్ప, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



జాపాలలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆశావర్కర్ల నూతన కార్యవర్గం

ఆమనగల్లు: తలకొండపల్లి మండల ఆశాకార్యకర్తల నూతన కార్యవర్గం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆమనగల్లు కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఆశాకార్యకర్తల సంఘం అధ్యక్షురాలిగా సుజాత, ప్రధాన కార్యదర్శిగా విమల, కోశాధికారిగా మాధవి, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, సహాయ కార్యదర్శిగా సునీత, సభ్యులుగా తదితరులను ఎన్నుకున్నారు.



తలకొండపల్లిలో జరిగిన సమావేశంలో ఆశా కార్యకర్తలు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్తా చాటి కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్దలో పార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లెల్లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ చేపడుతున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో ప్రజలకు చెప్పాలన్నారు. అదేవిధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వెళ్లి వివరించి ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలన్నారు. తద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో నాయకులు అంజయ్యగౌడ్, సురేష్‌బాబు, వెంకటేష్, శ్రావణ్, యాదగిరి, కుర్వ రాజు, భీమయ్య, సందీప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ఎంపీడీఓ అనురాధ

కొందుర్గు: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ అనురాధ అన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయాల్లో జోనల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల ఎంపీడీఓలు అనురాధ, ప్రవీన్‌కుమార్ ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సరిపడా స్టేషనరీ ఉండేలా చూడాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు సరిగా ఉండేలా ముందుగానే చూసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓలు విజయ్‌కుమార్, హన్మంతురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనురాధ

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న అండాలు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు

షాద్‌నగర్‌రూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు అన్నారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అండాలు హాజరై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఉంటాయన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఆహారంలో పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలను విధిగా తీసుకోవాలన్నారు. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ, ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి, ఉపాధ్యాయులు కృష్ణమ్మ, మాలతీ, రజిత, ఆయా సంతోష, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

సీడీపీఓ ఉదయశ్రీ

కొత్తూరు: బాలింతలు, గర్భిణులు తరచూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. పట్టణంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. నిత్యం పండ్లు, కూరగాయాలు తినడంతో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బాలింతలు, గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. సొంత వైద్యంతో ఇబ్బందులు ఎదురవుతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీలు ఇందిరా, సుమిత్ర, స్వప్న, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

ఆశావహుల్లో ఆందోళన!

- షెడ్యూల్ విడుదలైనా తొలగని ఉత్కంఠ
- నేటి హైకోర్టు తీర్పుపైనే అందరి దృష్టి
- అభ్యర్థుల కోసం వివిధ పార్టీ నాయకుల కసరత్తు



ఎంపీడీఓ కార్యాలయం

కొందుర్గు: స్థానిక ఎన్నికల కోసం ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించడంతో గ్రామాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. దాదాపు రెండేళ్ల నుంచి స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అంటూ ఎదురు చూస్తున్న నేతలకు రిజర్వేషన్ల ప్రకటనతో ఒక్కసారిగా ఆశలు చిగురించాయి. గతంలో ఉన్న రిజర్వేషన్లు మార్చి బీసీలకు 42 శాతం కేటాయించడంతో ఏళ్లగా ఎదురుచూస్తున్న నేతల ఆశలన్నీ తలకిందులయ్యాయి. ఎవరూ ఊహించని విధంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు మారిపోయాయి. ఇక 9వ తేదీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తే తాము పోటీలో ఉంటామని ఓ వైపు పలువురు నాయకులు గ్రామాల్లో చర్చలు జరుపుతున్నా మరో వైపు హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో అంటూ ఆందోళనకు గురవుతున్నారు.

తీర్పు అనుకూలంగా వస్తుందా..

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ జీఓకు ఆమోదం లభిస్తుందా.. లేక ప్రభుత్వానికి వ్యతిరేఖంగా తీర్పు వచ్చి ఎన్నికలు వాయిదా పడుతాయా.. అంటూ ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు. పోటీచేసేందుకు ఆశిస్తున్న నాయకులు ఆయా పార్టీల అధిష్టానంతో మంతనాలు మొదలుపెట్టారు.

జెడ్పీటీసీ రేసులో..

కొందుర్గు జెడ్పీటీసీ బీసీ జనరల్‌కు కేటాయించడంతో కాంగ్రెస్ నుంచి పర్వతాపూర్‌కు చెందిన మల్లేశ్‌గౌడ్, తంగెళ్లపల్లి నుంచి గోవర్ధన్‌గౌడ్, కొందుర్గు నుంచి ఫయూమ్, రామయ్యగౌడ్, కావలి యాదయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి కొందుర్గు నుంచి రాజేశ్‌పటేల్, రేగడిచిల్కమర్రి బందులాల్, పర్వతాపూర్ దర్గ రామచంద్రయ్య, బీజేపీ నుంచి బోయ శంకర్ పోటీలో ఉన్నట్లు మండలంలో చర్చించుకుంటున్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ నుంచి..

జిల్లేడ్ చౌదరిగూడ జెడ్పీటీసీ కోసం కాంగ్రెస్ నుంచి చలివేంద్రంపల్లి రాజు, గుర్రంపల్లి ఆంజనేయులు, జాకారం చంద్రశేఖర్, గుంజల్‌పహాడ్ సత్యనారాయణరెడ్డి, కృష్ణ అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి ఇంద్రానగర్ అక్రమ్, జిల్లేడ్ వెంకటేశ్, ఎల్కగూడ కొండి యాదయ్య, ఎదిర సత్యప్రమోద్‌రావు, బీజేపీ నుంచి చౌదరిగూడ నుంచి సుధాకర్‌రావు, అనీల్, పెద్దఎల్కిచర్ల భూపాలచారి, మనోహర్‌రెడ్డి పోటీలో ఉన్నట్లు తెలిసింది. ఇక హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో.. అధిష్టానం తీర్పు ఎలా వస్తుందోనని ఆశావహులు ఎదుచూస్తున్నారు.